సాక్షి పార్వతీపురం మన్యం

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



సర్పంచ్‌లకు పంచ్..!

గ్రామస్వరాజ్య సాధనలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు దిశానిర్దేశం చేసేది సర్పంచులే.

- 8లో



విషాదం నింపిన కుంభమేళా

కుంభమేళాలో పాల్గొని తిరుగు ప్రయాణంలో గంట వ్యవధిలో సంతోషంగా ఇంటికి చేరుకుంటామనుకున్న ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

- 8లో



ఘనంగా కనికరమాత యాత్ర

కొండడాబాల వద్ద ఉన్న వ్యాకులమాత యాత్ర ఆదివారం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

అరసవల్లి శోభాయాత్రలో రాములోరి రథం



అరసవల్లి శోభాయాత్రలో రామతీర్థం రథం

నెల్లిమర్ల రూరల్: శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యభగవానుడి రథయాత్ర మహోత్సవాన్ని రాష్ట్ర పండగగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు పుణ్యక్షేత్రాలకు చెందిన రథాలు శోభాయాత్రలో పాల్గొనగా... రామతీర్థం శ్రీ సీతారామస్వామి వారి రథం ఉత్సవాల్లో కనువిందు చేసింది. దేవస్థాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సర్వే సందేహాల నివృత్తికి ‘ఎక్స్‌పర్ట్ సెల్’

విజయనగరం అర్బన్: భూముల రీసర్వేకు సంబంధించి భూముల యజమానులకు వచ్చే సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా సర్వే భూరికార్డుల కార్యాలయంలో ఒక ఎక్స్‌పర్ట్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదివారం తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని ఈ సెల్ ఇన్‌చార్జ్‌గా నియమించామన్నారు. ఎక్స్‌పర్ట్ సెల్ అధికారిగా సర్వే భూరికార్డుల శాఖకు చెందిన ఎ.మన్మథరావును నియమించామని పేర్కొన్నారు. 9441633116 మొబైల్ నెంబర్‌లో ఆయన కార్యాలయ పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటూ సర్వే విభాగం క్షేత్ర స్థాయి సిబ్బందికి భూ యజమానులకు రీసర్వేపై వచ్చే సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. ఆయన సహాయకులుగా డిప్యూటీ సర్వేయర్ ఎన్‌వీఆర్ నరేష్‌రెడ్డిని నియమించామని, ఆయన 94403 64608 మొబైల్ నెంబర్‌లో అందుబాటులో ఉంటూ సందేహాలు నివృత్తి చేస్తారని పేర్కొన్నారు.

మే 6న దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం



బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల కొంగు బంగారమైన గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మే 6న నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ఆదివారం ప్రకటించింది. గొల్లపల్లిలో ఆదివారం సమావేశమైన ఉత్సవ కమిటీ సభ్యులు మండల జనార్ధనరావు, వజ్జి రవి, సర్వసిద్ధి హేమంత్‌లు ఉత్సవ తేదీలను వివరించారు. మార్చి 10న అమ్మవారిని గొల్లపల్లి గ్రామంలోకి తోడ్కొని వస్తారు. ఏప్రిల్ 6న గుర్తించిన సిరిమానును గ్రామంలోకి తీసుకువస్తారు. మే 4న దేశతల్లి వారాలు ప్రారంభిస్తారు. మే 5న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించి మే 6న మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల మధ్య సిరిమాను రథం కదిలే ముహూర్త కాలంగా నిర్ణయించారు. మే 7న అంపకోత్సవాన్ని (అమ్మవారి జాతర పరిపూర్తి) నిర్వహిస్తారు. ఈ క్రమంలో దాడితల్లి సిరిమానోత్సవ పండగను నిర్వహించేందుకు పురోహితులు, పెద్దలు నిర్ణయించినట్టు వెల్లడించారు.

లక్ష్యం పూర్తి.. మరి మిగులు మాటేంటి..!

- జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం 2.70 లక్షల మెట్రిక్ టన్నులు
- పూర్తయిన ధాన్యం కొనుగోలు లక్ష్యం
- ఇంకా కొనుగోలుకు సిద్ధంగా ఉన్న మరో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం



తెట్టంగి సమీపంలో రోడ్డుపై అమ్మకానికి ఉంచిన ధాన్యం బస్తాలు



ఈ చిత్రం చూశారా... వీరఘట్టం మండలం తలవరం పొలాల్లో ఉన్న వరి కుప్పలు. డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు పొలాల్లోకి ట్రాక్టర్లుగాని, నూర్పు యంత్రాలుగాని వెళ్లలేకపోవడంతో ఈ ప్రాంతంలో నూర్పులు జరగక పొంట పొలాల్లోనే వరి కుప్పలు ఉండిపోయాయి. ఇలా ఈ ప్రాంతంలో సుమారు 100 ఎకరాల్లో కోసిన వరి పంటను రైతులు కుప్పలు వేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉంది. నూర్పులు చేసి ధాన్యం అమ్ముదామంటే కొనే నాథుడు కరువయ్యాడు. గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి రైతులు అడిగితే ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయినందున మీ ధాన్యాన్ని కొనలేమని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.

వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేసి రైతుకు అండగా ఉంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం యొక్క హామీలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందనే నెపంతో ప్రభుత్వం వారం రోజుల క్రితం ధాన్యం కొనుగోలును నిలిపి వేసింది. దీంతో ఇంకా కళ్లాల్లోను, పంట పొలాల్లో నూర్పులకు సిద్ధంగా ఉన్న వరి పంటను ఎవరు కొనుగోలు చేస్తారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.



నీలానగరం రోడ్డుపై అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

మొక్కుబడి కేంద్రాలు

ఖరీఫ్‌లో పండిన ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 183 కేంద్రాలు మొక్కుబడి కేంద్రాలుగా మారాయి. ప్రతీ గ్రామంలో దళారులు దందా చేస్తూ ధాన్యం కొనుగోలును వారి గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. దీంతో రైతుల వద్ద దళారులు, వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని తామే కొనుగోలు చేసినట్లు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో జరుగుతున్న మోసాలను నిలువరించలేక చతికిలబడింది. అయితే పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకోలేక రైతన్నలు వచ్చిన ధరకే విక్రయించుకున్నారు. ఇంతలోనే ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని కొనుగోలు కేంద్రాలు చెబుతుండడంతో తాము పండించిన ధాన్యం ఎవరు కొంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 1,75,485 ఎకరాల్లో వరి సాగు చేయగా 3,57,921 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇందులో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యవసాయ శాఖ లక్ష్యంగా చేసుకుంది. ఈ లక్ష్యం ఇటీవల పూర్తయింది. అయితే ఇంకా జిల్లా వ్యాప్తంగా మరో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే అన్ని గ్రామాల్లోని పంట పొలాల్లో ఉన్న వరి కుప్పలు, నూర్పులు చేసిన ధాన్యం బస్తాలను లెక్కించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి మిగులు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళన చెందొద్దు..

రైతులు ఆందోళన చెందొద్దు. ప్రస్తుతానికి ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయింది. జిల్లాలో అన్ని మండలాల్లో ఇంకా ఎన్ని ధాన్యం నిల్వలు ఉన్నాయో మండల వ్యవసాయ శాఖ అధికారులకు నివేదికలు అడిగాం. ఆ నివేదికలు వచ్చిన వెంటనే ప్రభుత్వానికి మరలా ప్రతిపాదనలు చేసి రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపడతాం.

– పి.శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ డిపో మేనేజర్, పార్వతీపురం మన్యం

ఐదెకరాల్లో పంట కుప్పలు వేశాం..



ఈ ఏడాది 5 ఎకరాల్లో వరి పంట వేశాను. డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్‌కు పొలాల్లోనే కుప్పలు వేశాం. అప్పుడేమో పొలాల్లో బురద ఉండడంతో ట్రాక్టర్లుగాని, నూర్పు యంత్రాలుగాని రాకపోవడంతో నూర్పులు చేయలేకపోయాం. ఇప్పుడు వాతావరణం బాగుందంటే ధాన్యం లక్ష్యం పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఏం చేయాలో మీరే చెప్పండి.

– **తుమ్మలపల్లి సీతంనాయుడు**, రైతు, తలవరం, వీరఘట్టం మండలం

నూర్పులు చేయకుండా వదిలేశాను..



ధాన్యం కొనేవారు లేక రెండున్నర ఎకరాల్లో వరి కుప్పలను నూర్పులు చేయకుండా వదిలేశాను. కనీసం వ్యాపారులు కూడా ధాన్యం కొనేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి మా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

– **తుమ్మలపల్లి శ్రీనివాసరావు**, రైతు, తలవరం, వీరఘట్టం మండలం

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

- జిల్లా బీసీ సంక్షేమాధికారి పెంటోజీరావు

బొబ్బిలి: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటూ వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి బి.పెంటోజీరావు అన్నారు. పట్టణంలోని బీసీ సంక్షేమ వసతిగృహంలో డివిజన్‌లోని వసతిగృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెంటోజీరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలన్నారు. సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్ చెప్పిన ముఖ్యాంశాల ఆధారంగా పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. తద్వారా శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అధికారులు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రాజాం, సంతకవిటి మండలాలకు చెందిన 150 మంది విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేశారు. సహాయ సంక్షేమాధికారిణి జి.శ్యామలకుమారి, సంక్షేమాధికారులు డి.శ్రీనివాసరెడ్డి, ఎస్.దాసు, ఎస్.సరస్వతి, ఇన్‌స్ట్రక్టర్లు బి.వాసు, టి.ఈశ్వరరావు, జయలక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ అలజడి

- గుర్లలో ప్రబలిన డయేరియా

గుర్ల: మండల కేంద్రంలో మళ్లీ డయేరియా ప్రబలడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా పది మంది డయేరియా బారిన పడి చికిత్స తీసుకున్నారు. ఎక్కువగా చిన్నారులకు వాంతులు, విరేచనాలు కావడంతో తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురువుతున్నారు. గత ఏడాది నవంబర్‌లో డయేరియాతో గుర్ల గ్రామంలో భయానక పరిస్థితులు ఏర్పడిన సంగతి తెలిసిందే. మళ్లీ గ్రామంలో డయేరియా కేసులు నమోదుకు వాటర్ ట్యాంకులో మోతాదుకు మించి బ్లీచింగ్ చల్లడమే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గుర్లతో పాటు గుజ్జింగివలస, గూడేంలో కూడా డయేరియా కేసులు నమోదవుతున్నాయి. డయేరియా బారిన పడిన వారు గుర్ల పీహెచ్‌సీ లో చికిత్స పొందుతున్నారు. డయేరియా బారి నపడిన వారిలో నేరడబిల్లి అశ్విని, సారికి అప్పలనాయుడు, సారికి సాయి, కొత్తూరు దుర్గ, గుజ్జింగివలసకు చెందిన పాట్నూరు మేరీ ఉన్నారు.

రెవెన్యూ లీల..!

- నిబంధనలకు విరుద్ధంగా ఎల్‌పీసీ జారీ
- గోకులం నిర్మాణానికి ప్రభుత్వ భూమి
- పెణసాంలో రెవెన్యూ అధికారి నిర్వాకం

గంట్యాడ: రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవలేదన్న సామెత చందాన రెవెన్యూ అధికారులు తమ లీలలు కొనసాగిస్తున్నారు. సామాన్యులకు ఏదైనా రెవెన్యూ పరమైన సమస్య వస్తే పరిష్కరించేందుకు సవాలక్ష కొర్రీలు వేసే వీరు ఏకంగా ప్రభుత్వ భూమిని మినీ గోకులం నిర్మాణానికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్(ఎల్‌పీసీ) ఇచ్చేశారు. అధికారి పార్టీ నేతల ఒత్తిడితోనే ఇలా ఎల్‌పీసీ జారీ చేసారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పెణసాం గ్రామంలో జారీ చేసిన ఎల్‌పీసీపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎల్‌పీసీ జారీకి నిబంధనలు

మినీ గోకులం నిర్మాణానికి సదరు రైతుకు ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, తెల్లరేషన్ కార్డు, సొంత భూమి ఉండాలి. సొంత భూమి ఉన్న రైతుకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం గాని, వన్‌బీగాని ఉండాలి. వాటి ఆధారంగా ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయాలి. దాని ఆధారంగా మినీ గోకులం నిర్మించుకోవాలి.



రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఎల్‌పీసీ సర్టిఫికెట్

ప్రభుత్వ భూమి 0.15 సెంట్లకు ఎల్‌పీసీ ఇచ్చిన వైనం

గంట్యాడ మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సర్వే నంబరు 19 – 1లో 0.15సెంట్లు ప్రభుత్వ భూమికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో అది గయాలు(ప్రభుత్వ భూమి)గా నమోదై ఉంది. అయినప్పటికీ ఎల్‌పీసీ ఇవ్వడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏమి ఆశించి రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎల్‌పీసీ జారీ చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

నల్లజీడి సీజన్ ఆరంభం



అటవీ ఉత్పత్తులు తమకే విక్రయించాలంటూ ప్రచారం చేస్తున్న జీసీసీ అధికారులు

- జీసీసీ మద్దతు ధర కిలో రూ.22
- వారపు సంతల్లో విస్తృతంగా కొనుగోలు
- అటవీ ఉత్పత్తులు తమకే విక్రయించాలంటూ ప్రచారం చేస్తున్న జీసీసీ
- రంగుల తయారీలో వినియోగం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని కొండపోడులో పండే నల్లజీడి పిక్కలను గిరిజన సహకార సంస్థ విస్తృతంగా కొనుగోలు చేస్తుంది. వారపు సంతల్లో కిలో రూ.22కి కొనుగోలు ప్రారంభించింది. గతేడాది కిలో రూ.18కి కొనుగోలు చేయగా ఈ సంవత్సరం రూ.4 పెంచి రూ.22కి కొనుగోలు చేస్తున్నారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, దోనుబాయిలో గురువారం, కుశిమి, పొల్లలో శనివారం వారపు సంతల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి జీసీసీ శాండీ ఇన్‌స్పెక్టర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా తమకే అటవీ ఉత్పత్తులు విక్రయించాలంటూ జీసీసీ సిబ్బంది ప్రచారం సైతం నిర్వహిస్తున్నారు.



గిరిజనులు సేకరించిన నల్లజీడి పిక్కలు

మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నల్లజీడి వంటి ఉత్పత్తులు జీసీసీతో పోటీగానే కొనుగోలు చేస్తున్నారు.

రంగుల తయారీలో వినియోగం

ముంబయిలో రంగుల తయారీ కంపెనీలు ఎక్కువగా ఉండడంతో వీటిని రంగుల తయారీకి వినియోగిస్తున్నట్టు సమాచారం. అలాగే కేరళలో నల్లజీడి పిక్కల మధ్యలో ఉన్న పలుకులను తీసేసి ఇష్టంగా అక్కడ ప్రజలు తింటారు. వీటిని కిలో పలుకులను రూ.400లకు గిరిజనులు విక్రయిస్తారు. పలుకులను తీయడం చాలా కష్టమైన పని. దీనికి సంబంధించిన జీడి చేతికి అంటితే అంత త్వరగా వదలదని, పైగా చర్మవ్యాధులు కూడా వచ్చేస్తాయని గిరిజనులు చెబుతున్నారు. అందుకే పలుకులను తీయలేని పరిస్థితిలో జీడి పిక్కలనే విక్రయించేస్తామని గిరిజనులు తెలియజేస్తున్నారు. ప్రతీ ఏడాది ఇప్పటి నుంచి ఏప్రిల్ వరకు సీజన్ ఉంటుంది. గిరిజనులు కొండల్లో ఉన్న ఈ చెట్లు వద్దకు వెళ్లి నల్లజీడిని సేకరిస్తారు. కొండపోడులో అక్కడక్కడ ఇవి ఉంటాయి.

నల్లజీడి కొనుగోలు చేస్తున్నాం..



గిరిజనులు సేకరించే నల్లజీడి పిక్కల కొనుగోలు ప్రారంభించాం. సోమవారం సీతంపేటలో జరిగే వారపు సంతలో కాటాలు వేసి కొనుగోలు చేస్తున్నాం. అలాగే మిగతా సంతల్లో కూడా నల్లజీడి కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నాం.

– దాసరి కృష్ణ, సీతంపేట జీసీసీ మేనేజర్

సేకరణ కష్టమే..



నల్లజీడి కొండకోనల్లో ఉన్న చెట్ల వద్దకు వెళ్లి సేకరించాలి. ఈ సంవత్సరం దిగుబడి కూడా అంతంత మాత్రంగానే ఉంది. నల్లజీడికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో మాకు కూడా ఆదాయం వస్తుంది. గతేడాది కంటే ఈ సంవత్సరం ధరలు కూడా పెరిగాయి.

– ఎం.ఫల్గుణరావు, పొంద్ర

క్లుప్తంగా

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి కలకలం


సెల్‌టవర్‌పై ఉన్న అపరిచిత వ్యక్తి

జియ్యమ్మవలస: మండలంలోని ఏజెన్సీ పంచాయతీ పెదతోలుమండలో ఎయిర్‌టెల్ సెల్‌టవర్ ఎక్కి ఓ అపరిచిత వ్యక్తి కలకలంసృష్టించాడు. ఆదివారం మధ్యాహ్నం సెల్‌టవర్ ఎక్కిన అపరిచిత వ్యక్తి గ్రామ గిరిజన ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు జియ్యమ్మవలస, చినమేరింగి ఎస్సైలు పి.ప్రశాంత్‌కుమార్, పి.అనిల్‌లు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దాదాపు మూడు గంటలు శ్రమించి ఆపరిచిత వ్యక్తిని టవర్‌పై నుంచి కిందికి దించారు. అపరిచిత వ్యక్తిని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. అనంతరం ఆ వ్యక్తిని జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌కు తరలించి పరిస్థితి సమీక్షిస్తున్నారు.

నేడు చైర్మన్ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసి నగరపంచాయతీ అధికారులు

పాలకొండ: నగరపంచాయతీ చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 20 మంది కౌన్సిలర్లు, స్థానిక ఎమ్మెల్యే ఓటు హక్కు పొంది ఉన్నారు. వారందరికీ ఫారం-2 నోటీసులు అందించినట్లు కమిషనర్ సర్వేశ్వర రావు తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారితో లెక్కవేస్తే టీడీపీకి 4, వైఎస్సార్‌సీపీకి 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ప్రస్తుతం తాత్కాలిక చైర్మన్‌గా పల్లా ప్రతాప్ కొనసాగుతున్నారు. 2వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికై ప్రసుతం టీడీపీలో చేరిన కౌన్సిలర్లలో ఆకుల మల్లీశ్వరి మాత్రమే నిబంధనల మేరకు చైర్మన్ పదవికి పోటీలో ఉన్నారు. సభ్యులు అంగీకరిస్తే ఆమె చైర్మన్‌గా కొనసాగుతారు. లేని పక్షంలో తాత్కాలిక చైర్మన్‌ను కొనసాగించాల్సి ఉంటుంది. ఈ ఉత్కంఠకు సోమవారం తెరపడనుంది.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన అప్పల నాయుడు (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామానికి చెందిన పిల్ల అప్పల నాయుడు (35) గడ్డి మందు తాగి ఆత్మ హత్యా యత్నం చేసి విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పెదమానాపురం ఎస్సై జయంతి ఆదివారం తెలిపారు. మృతుడి కుమారుడు రామునాయుడు ఫిర్యాదు మేరకు ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 31వ తేదీన మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతకగా ఆరోజు సాయంత్రం కళ్లంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నట్టు గుర్తించి వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. గజపతినగరంలో వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సింహాచలం కుమారుడు కుమార్తె ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా తమ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 250 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులకు రహదారి భద్రత, హెల్మెట్ ధారణ పట్ల అవగాహన కల్పించామన్నారు. ఎంవి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 393 కేసులు నమోదు చేసి, రూ.లక్షా 20వేల 640లు ఈ చలానాగా విధించామన్నారు. ప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ డి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సంబంధిత సీఐలు, ఎస్సైలు ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొని, దాడులు నిర్వహించారని ఎస్పీ వివరించారు.

చోరీ కేసునమోదు

బాడంగి: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన చప్పకృష్ణ మూర్తి ఇంటిలో ఉదయం 10గంటల ప్రాంతంలో జరిగిన ఈ దొంగతనంలో బీరువాలో పెట్టిన రెండుతులాల బంగారు పుస్తెలతాడు, ముప్పాతిక గ్రాముల చెవి దిద్దులతోపాటు, రూ.12 వేలు చోరీకి గురైనట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇంటితలుపులు వేసి బయట తాళం ఉంచి చర్చికి వెళ్లి వచ్చి చూడగా బీరువా తాళాలు తీసి చిందరవందరగా పడి ఉండడం, బీరువాలో బంగారం, నగదు పోవడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

సర్పంచ్‌లకు పంచ్..!

- వారి అధికారాలు కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 626 పంచాయతీలు
- సుమారు రూ.280 కోట్ల అంచనావ్యయంతో 2,851 పనులు
- అనధికార వ్యక్తులకు పనుల అప్పగింత
- ఎన్నికల ముందు ఎన్నో హామీలు
- అధికారంలోకి వచ్చాక చిన్నచూపు
- వెల్లువెత్తుతున్న విమర్శలు


నిర్వీర్యమవుతున్న మిర్తివలస పంచాయతీ కార్యాలయం

రామభద్రపురం: గ్రామస్వరాజ్య సాధనలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు దిశానిర్దేశం చేసేది సర్పంచులే. అలాంటి సర్పంచ్‌ల హక్కులు, అధికారాలను కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి సంబంధించిన సర్పంచ్‌లు ఉన్నారనే అక్కసుతో ప్రభుత్వం వారిని పక్కన పెడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులను వెండర్‌కోడ్ పేరుతో ఇతరులతో చేయించి అవమానిస్తోంది. గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేది సర్పంచ్. అందుకే వారికి ప్రత్యేక అధికారాలు, విధులు కేటాయించారు. వారి విధులు, అధికారాలను కాలరాస్తే అది చట్ట విరుద్ధమని తెలిసినా కూడా ప్రభుత్వం అలాంటి చర్యలకు పాల్పడడం స్వార్థరాజకీయాలకు నిదర్శనమని పలువురు సర్పంచ్‌లు విమర్శిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 626 పంచాయతీలు ఉన్నాయి. ఉపాధిహామీ నిధులు సుమారు రూ.280 కోట్ల అంచనావ్యయంతో 2,851 పనులు చేపడుతున్నారు. ఈ పనులన్నీ కూటమి నేతలు అనధికార వ్యక్తులకు అప్పగించి చేయిస్తున్నారు.

సర్పంచ్ అధికారాలకు తూట్లు..

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె పండగ పేరుతో ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్స్, తదితర అభివృద్ధి పనులు చేపడుతోంది. ఈ పనులు సంబంధిత గ్రామ సర్పంచ్ ఆమోదంతో తీర్మానించి చేయాల్సి ఉంది.అయితే చాలా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆమోదం అవసరం లేకుండానే కాంట్రాక్టర్ పేరిట వెండర్ కోడ్ ప్రారంభించి పనులు చేయిస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత పంచాయతీ ఖాతాల్లో జమ చేయాల్సిన నిధులను వెండర్ల ఖాతాల్లోకి జమచేస్తున్నారు.అడ్డగోలుగా సాగుతున్న కూటమి పాలన తీరుపై సర్పంచ్‌లు విమర్శలు గుప్పిస్తున్నారు.


పాతరేగలో కూటమినేతలు నిర్మించిన సీసీ రోడ్డు

అధికారంలోకి వచ్చాక ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్పంచ్‌లకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదు. వారి విధులు, అధికారాలను ఎమ్మెల్యేల చేతిలోకి తీసుకున్నారు. సర్పంచ్‌లకు తెలియకుండానే పనుల తీర్మానం చేస్తున్నారు.ఆ పనులను వేరొకరికి అప్పగించి సర్పంచ్‌లను అవమానపరుస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.ఇవన్నీ డిప్యూటీ సీఎంకు తెలిసినప్పటికీ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఎన్నికల ముందు ఇలా..

పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే గ్రామ పంచాయతీలకు ప్రాణప్రతిష్ఠ కల్పిస్తామన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే పంచాయతీలు పరిపుష్టం కావాలని నీతులు చెప్పారు. సర్పంచ్‌ల అధికారాన్ని కాపాడి గౌరవ మర్యాదలు కల్పిస్తామని ఊదరగొట్టారు.

అధికారాలు కాలరాయడానికే హేతుబద్ధీకరణ..



సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ అసంబద్ధం. అలా చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదు. సర్పంచ్‌ల అధికారాలు కాలరాయడానికే ఈ నిర్ణయం తీసుకున్నారు. సచివాలయాల రేషనలైజేషన్‌తో పంచాయతీ సర్పంచ్‌ల బాధ్యత ఏమిటో తెలియడం లేదు. గ్రామాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షనిర్ణయంతో నలుగురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ అసంబద్ధ నిర్ణయాలతో హేతుబద్ధీకరణ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం దారుణం.

మజ్జి రాంబాబు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు.

సర్పంచ్‌లకు ప్రాధాన్యం లేదు..



ఈ ప్రభుత్వం వచ్చాక సర్పంచ్‌లకు ఎందులోనూ ప్రాధాన్యం కల్పించడంలేదు. ఇలాంటి ధోరణి గతంలో ఎన్నడూ లేదు. పంచాయతీ పాలన మొత్తం సర్పంచ్ చేతుల మీదుగానే జరగాలనే నిబంధన ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో అందుకు భిన్నంగా జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, అభివృద్ధి పనులు, సభలు, సమావేశాలకు ఆహ్వానించడం లేదు. కూటమి ప్రభుత్వ నేతలతోనే వాటిని జరిపిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న సర్పంచ్‌లకు ఈ దుస్థితి ఏమిటి? గ్రామ స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది.

సోముల కుమారి, సర్పంచ్, రావివలస

వెండర్లతో పనులా?



ప్రజలతో ఎన్నికైన సర్పంచ్‌లను కాదని వెండర్లతో పనులు చేయించి వారి ఖాతాల్లో నిధులు జమచేయడం వింతగా ఉంది. బయట వ్యక్తులు పనులు చేయడం సర్పంచ్‌లను అవమానపరిచినట్లే. ఎన్నికలకు ముందు సర్పంచ్‌లకు ప్రాధాన్యమిస్తామని, ఏవో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌ల పట్ల వివక్ష చూపుతున్నారు.ఈ ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ధోరణి మార్చుకోవాలి.

గొట్టాపు పైడిపునాయుడు, సర్పంచ్ భర్త, పాతరేగ

గుర్తింపు లేకుండా చేశారు..



కూటమి ప్రభుత్వం సర్పంచ్‌లకు గుర్తింపు లేకుండా చేసింది.ఇటీవల గ్రామంలో ఉపాధిహామీ పథకంలో పనులను చేపట్టారు.ఆ పనులను సర్పంచ్ అంగీకారం లేకుండానే జరిపిస్తున్నారు. పంచాయతీలో అభివృద్ధి పనులు ఆగకూడదన్న ఉద్దేశంతో అడ్డుకోవడం లేదు.ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు.

వైకుంఠం విజయభాస్కరరావు,సర్పంచ్ దుప్పలపూడి

బొబ్బిలిలో భారీ చోరీ

- 40 తులాల బంగారం, 20లక్షల నగదు అపహరణ
- కుటుంబసభ్యులు ఊరెళ్లిన సందర్భంగా ఘటన


ప్రధాన ద్వారానికి ఉన్న గొళ్లెం విరగ్గొట్టిన దృశ్యం

బొబ్బిలి: ప్రశాంతంగా ఉన్న బొబ్బిలిలో శనివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. పెద్దస్థాయిలో చోరీ జరగడంతో పట్టణ వాసులు ఉలిక్కి పడ్డారు. పట్టణానికి చెందిన గ్రంధి రవికుమార్ శుక్రవారం విశాఖలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అంతకు రెండు రోజుల ముందే ఆయన భార్య, కుటుంబసభ్యులు కూడా విశాఖ వెళ్లారు. విశాఖ వెళ్లొచ్చాక కుంభమేళాకు వెళ్దామని కుటుంబ సభ్యులంతా నిర్ణయించుకున్నారు. అయితే ఆదివారం ఉదయం ఎప్పటిలాగే ఇంటిముందు పరిశుభ్రపరచి కళ్లాపు చల్లి, ముగ్గు పెట్టి వెళ్లే పనిమనిషి వచ్చేసరికి ఇంటి తలుపు తెరిచి ఉండటంతో ఆందోళన చెంది వెంటనే ఎదురింటి వారికి సమాచారమిచ్చి రవికుమార్‌కు విషయం తెలియజేయాలని కోరింది. దీంతో ఎదురింటి వారి ద్వారా సమాచారం తెలుసుకున్న రవికుమార్ హుటాహుటిన బొబ్బిలి వచ్చేశారు. రాగానే ఇంటిలో ఏమేం ఉంచాం? ఏమేం పోయాయో? ఓ సారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీరువాలో ఉంచిన 40 తులాల బంగారు ఆభరణాలు, ఆందులోనే మరో చోట ఉంచిన రూ.20 లక్షల నగదు పోయినట్లు వాపోయారు.


చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ సతీష్ కుమార్ తదితరులు

డీఎస్పీ పరిశీలన

పట్టణంలో భారీ దొంగతనం జరిగిందన్న విషయం తెలుసుకున్న బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, సీఐ కె.సతీష్ కుమార్, ఎస్సైలతో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఇంటిలో దొంగతనం ఎలా జరిగి ఉంటుందో పరిశీలించారు. ప్రధాన ద్వారానికి ఉన్న గొళ్లాన్ని కోసి లోనికి ప్రవేశించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం క్లూస్ టీమ్‌కు సమాచారం అందజేశారు. ఈ లోగా చుట్టుపక్కల ఇళ్ల వారిని ప్రాథమికంగా విచారణ చేశారు. ఎవరైనా అనుమానితులు ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో సంచరించారా? అన్న విషయమై ఆరా తీశారు. ఆదివారం సాయంత్రం విజయనగరం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. ఈ సందర్భంగా సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ డీఎస్పీ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలతో దొంగలను పట్టుకుని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

విషాదం నింపిన కుంభమేళా

- కనిమెట్ట సమీపంలో రోడ్డుప్రమాదం
- పోలిపల్లి ఇంగ్లీష్ ఉపాధ్యాయిని మృతి
- మరో నలుగురికి గాయాలు

పూసపాటిరేగ: ఉత్తరప్రదేశ్‌లో కుంభమేళాకు వెళ్లడానికి వందల కిలోమీటర్లు ప్రయాణించారు. కుంభమేళాలో పాల్గొని తిరుగు ప్రయాణంలో గంట వ్యవధిలో సంతోషంగా ఇంటికి చేరుకుంటామనుకున్న ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఆ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవడంతో కారులో ప్రయాణిస్తున్న భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తతో పాటు కుటుంబసభ్యులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పూసపాటిరేగ మండలంలోని కనిమెట్ట సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని పోతినమల్లయ్యపాలానికి చెందిన కెంగువ రవికుమార్, భార్య సౌజన్య, కుమారుడు హృదయ్, కుమార్తె హంసిక, అత్త భోగి భవాని, డ్రైవర్ మనపరాజు ప్రసాద్‌లు కలిసి మహారాష్ట్రలో కుంభమేళాకు జనవరి 27 వతేదీన వెళ్లారు. కుంభమేళా అనంతరం తిరుగు ప్రయాణంలో ఫిబ్రవరి 1 వతేదీన విశాఖలోని పోతినమల్లయ్యపాలానికి కారులో తిరిగి బయల్దేరారు. మరో గంట వ్యవధిలో స్వగ్రామం చేరుకోబోతుండగా 2 వతేదీ ఉదయం 6 గంటల సమయంలో పూసపాటిరేగ మండలం కనిమెట్ట సమీపంలో వారు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సౌజన్య(41)కు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రవికుమార్‌కు కాలు విరగడంతో పాటు తీవ్రగాయాల య్యాయి. అత్త భవాని, పిల్లలు హృదయ్, హంసిక, డ్రైవర్ ప్రసాద్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతిచెందిన సౌజన్య భోగాపురం మండలంలోని పోలిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయిని. ఉపాధ్యాయిని సౌజన్య అనుకోని ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబసభ్యులతో పాటు తోటి ఉపాధ్యాయులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తీవ్రంగా గాయపడిన రవికుమార్ కొమ్మాది గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో గత 15 ఏళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సౌజన్య మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సౌజన్య మృతదేహం


ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా కారు

రంగస్థల కళాకారులకు నంది అవార్డులు



అక్కివరపు గౌరీశ్వరికి నంది అవార్డును అందిస్తున్న నిర్వాహకులు


రమణమూర్తికి నంది అవార్డు అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

రాజాం: రాజాం పట్టణానికి చెందిన రంగస్థల కళాకారిణి అక్కివరపు గౌరీశ్వరి, సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన ప్రముఖ హార్మోనిస్ట్, శ్రీమజ్జిగారి కళానికేతన్ నిర్వాహకుడు వావిలపల్లి రమణమూర్తిలకు తెలుగు వెలుగు సాహితీవేదిక నంది అవార్డులు అందించింది. వారి సేవలను గుర్తించిన తెలుగుసాహితీ వేదిక స్వామి వివేకానంద జయంతి మహోత్సవాల సందర్భంగా నంది అవార్డులకు ఎంపికచేసింది. ఈ మేరకు ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డులను ఆ సంస్థ జాతీయ చైర్మన్ పోలోజ్ రాజ్‌కుమార్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సంస్థ కోఆర్డినేటర్లు బాణాల రాజుచారి, జోనిగోని యాదగిరిగౌడ్‌లు వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారిని పద్మశ్రీ యడ్ల గోపాలరావుతో పాటు పలువురు కళాకారులు, రాజాం పట్టణ ప్రజలు అభినందించారు.

అక్షరాభ్యాసాలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన జ్ఞానసరస్వతి ఆలయం
- ఐదువేల మంది పైగా చిన్నారులకు కార్యక్రమం


అక్షరాభ్యాసం మంటపం వద్ద ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రింగురోడ్డులో కొలువైన జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శారదా సేవా సంఘం ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం వేకువజామునుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనల అనంతరం 6 గంటల నుంచే అక్షరాభ్యాసాల ప్రక్రియ నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 5200 మందికి పైగా చిన్నారులు అక్షరాభ్యాసంలో పాల్గొననున్నారు. ప్రతి 45 నిమిషాలకు ఒక బ్యాచ్ చొప్పున చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు రంగం సిద్ధం చేశారు. సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించే కార్యక్రమంలో ఇప్పటికే టికెట్లను భక్తులకు అందజేశారు. అప్పటికప్పుడు వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా స్పెషల్ కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, సేవకులు ఏర్పాట్లు పూర్తిచేశారు.


పుష్పాలంకరణలో వసంతపంచమికి ముస్తాబైన జ్ఞానసరస్వతి అమ్మవారు

రాష్ట్ర తైక్వాండోలో బంగారు పతకం


కోచ్‌లతో పవిత్ర

బాడంగి: రాష్ట్రస్థాయిలో అండర్-17 విభాగంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో బాడంగి మండలంలోని ముగడ గ్రామానికి చెందిన అలజంగి పవిత్ర బంగారు పతకం సాధించింది. పవిత్ర ప్రస్తుతం విశాఖజిల్లా మధురవాడలోని చంద్రంపాలెం ప్రభుత్వ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. కాకినాడలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 తైక్వాండో పోటీలలో తమ కుమార్తె బంగారుపతకం సాధించినట్లు తండ్రి ప్రసాద్ చెప్పారు. ఈ ప్రాంతానికి చెందిన పవిత్ర ఇలాం గారు పతకం సాధించడంతో మండల ప్రజలు అభినందించారు.


జాజిలిని అభినందిస్తున్న డైరెక్టర్ తదితరులు

రాష్ట్రస్థాయి తైక్వాండోలో బాలిక ప్రతిభ

బొబ్బిలి: పట్టణంలోని ఐరిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సదాశివుని జాజిలి విజయనగరంలో జిల్లా స్థాయి, తాడిపత్రిలో జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి, చివరగా హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర రెడ్డి స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆమెను అభినందించారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ వింజమూరి విజయకుమార్ శర్మ, సిబ్బంది ఆమెకు స్వీట్లు తినిపించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర రావు పాల్గొన్నారు.

ఘనంగా కనికరమాత యాత్ర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు


మేరీమాతను ప్రత్యేక పల్లకీలో పూలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కొండడాబాల వద్ద ఉన్న వ్యాకులమాత యాత్ర ఆదివారం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ఆలయానికి 133 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏటా ఫిబ్రవరి నెలలో మొదటి ఆదివారం నిర్వహించే ఈ యాత్రకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ చర్చిలో 1914వ సంవత్సరంలో పారిస్ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించిన వ్యాకులమాత ప్రతిమను కులమతాలకు అతీతంగా ఆరాధించడం ఇక్కడి ప్రత్యేకత.

ముగిసిన నవీనా ప్రార్థనలు

ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి సోయగాల నడుమ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కొండపై గత తొమ్మిది రోజులుగా ఫాదర్ గొంగాడ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవీనా ప్రార్థనలు శనివారం రాత్రిము గిశాయి. కనికరమాతను అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఉంచి క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. విశాఖపట్నంలోని జ్ఞానాపురం అతిమేత్రాణులు డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో పలువురు విచారణ కర్తలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


దేశంలో అత్యంత ఎత్తైన క్రీస్తు గొర్రెల కాపరి ప్రతిమ వద్ద భక్తులు

పటిష్ఠమైన బందోబస్తు

యాత్రకు వేలాది మంది తరలి రావడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో, సీఐ వి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల రాకపోకలకు గాను సింహాచలం, మద్దిలపాలెం ఆర్‌టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నిర్వహించారు. మొత్తంగా యాత్ర ప్రశాంతంగా ముగిసింది.


శిలువపై ఉన్న ఏసుక్రీస్తు వద్ద దీపాలను వెలిగిస్తున్న భక్తులు